సుషుప్తి

❖ శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి ❖

చంద్రశేఖరానికి విచిత్రవిషయాలలో జోక్యం కల్పించుకోవటం చాలా సరదా. ఊరందరకూ ఉత్తరమైతే అతనికి దక్షిణమే. పాడుబడ్డ దేవాలయాల్లోకే వెళ్ళేవాడు. దయ్యాల మేడల్లోనే నివసించేవాడు. మంత్రతంత్రాలు చేసే ఆడవాళ్ళ పూటకూళ్ళ ఇళ్ళల్లోనే తినేవాడు. అంతా విచిత్రంగా ఉంటే రమ్యంగా ఉందని భావించేవాడు. లోకానికి ఇతడూ ఒక పిచ్చివానిలాగానో, దయ్యంలాగానో కన్పించేవాడు. అతనిమీద అనేక అపవాదులు వేశారు. కాని అవన్నీ దున్నపోతుమీద వర్షం కురిసినట్లే. ఎవరూ దగ్గరకు రానిచ్చేవారు కాదు. అలాగే ఇతను వెళ్ళే ఇళ్ళల్లోకి కూడా ఇతరులు వచ్చేవారు కారు.

నరసమ్మ పూటకూళ్ల ఇల్లు చాలా ప్రఖ్యాతి చెందింది ఆవూళ్ళో. ఆవిడ రోజూ అర్ధరాత్రి స్మశానానికి వెళ్ళొస్తుందనీ, భూతాలతో సంభాషిస్తుందనీ, లోకులంతా భావించి, రాత్రి కాస్త పొద్దుపోతే ఆమె ఎక్కడ కన్పిస్తుందో అనే భయంతో ఇల్లు కదిలేవాళ్లు కారు. ఆమె అలా వెళ్లినా వెళ్లకపోయినా చంద్రశేఖరం మటుకు పాడుబడ్డ దేవాలయంనుంచీ అర్ధరాత్రి ఐతేగాని ఆమెఇంటికి భోజనానికి వచ్చేవాడుకాదు. పొద్దుపోయి తిరగకూడదనీ, ఊళ్ళో చాలా చెడ్డవాళ్లున్నారనీ, పెందలాడే భోజనం చేయటం మంచిదనీ, పగలు తీరిక లేకుండా చేసే ఉద్యోగానికి రాత్రి విశ్రాంతి అవసరమనీ ప్రతిరాత్రీ అతనికి భోజనంముందు హితోపదేశం చేస్తుంది. ఏమీ మాట్లాడేవాడు కాడు. చాలా మంచిపిల్లవాడని తన కొడుకు లాగానే చూస్తూఉండేది. కాని అతని ప్రవర్తనలో ఏమీ మార్పురాలేదు. ఆమెకు ప్రాణం విసికింది. ఒక నాటి రాత్రి అతను వచ్చాడు.

"నీకోసం ఎంత సేపో చూసీ చూసీ విసుగు పుట్టింది. నీజాడే లేకపోయింది. నీకు మంచిగా చెప్తే ఏమీ నచ్చటంలేదు. నీకు శాస్తి చేయాలి. రేపటినుంచీ వేళకు రాకపోతే భోజనం పెట్టను."

అనేసింది. చంద్రశేఖర మేమీ మాట్లాడలేదు. భోజనం చేశాడు. తన దారిన తాను వెళ్ళిపోయాడు. ఈ ఉపన్యాసాలతో కొన్నిరోజులు గడిచిపోయినవి. ఇదంతా మామూలైం దతనికి. ఒకరోజు భోజనమైనాక అతన్ని నిలవేసింది.

"నేనెవరో నీకు తెలుసునా?" అని అడిగింది.

అతని కాశ్చర్యం వేసింది. ఇలాంటి ప్రశ్న అత డెప్పుడూ వినలేదు. వస్తుందని అనుకోనూలేదు. కాని ఆమెముందు ఏమీ మాట్లాడివెరగడు. మళ్లీ అదేప్రశ్న వేసింది. కాస్త వస్తాయించి జవాబిచ్చాడు.

"మీరు నరసమ్మగారని అనుకొంటున్నాను"

"ఇంతేనా నీకు తెలిసింది? లోకు లేమనుకొంటున్నారో తెలుసా ?"

"ఆ, తెలియకేం ?......ఎవర్ని గురించి ?"

"నిన్నూ, నన్నూ గురించి."

"మీరు దయ్యాలతో సంభాషిస్తారనీ, నన్ను మీఅమ్మాయి కిచ్చి వివాహంచేయాలని నన్ను వశం చేసుకొన్నారనీ అంటున్నారు."

"అదే అడగాలని అనుకొంటున్నాను."

"ప్రొద్దున ఈసంగతి వినేదాకా మీదగ్గర ఒక అమ్మాయి ఉందనే నాకు తెలీకపోయింది. అందుచేత వాళ్ళపాపాన వాళ్లే పోతారని ఊరుకొన్నాను."

"సరేగాని, ఆ పాడుబడ్డ దేవాలయానికి రోజూ వెళ్తున్నావెందుకూ ?"

"అది వెనక కాళికాలయం. అక్కడ తపస్సు చేస్తే కాళికాదేవి ప్రత్యక్షమౌతుందనీ, నేనుకూడా కాళిదాసంతటివాణ్ణి ఔతాననీ ఆశ."

"దేవత ఏమన్నా సాక్షాత్కరించిందా ?"

"మీ కొక అమ్మాయి ఉందనీ, ఆమెపేరే కాళిక అనీ, అందుకనే ఆగుడికి వెళ్తున్నాననీ ప్రొద్దున్నే నాకు వాళ్లు సాక్షాత్కరింపజేశారు."

"ఇది అబద్ధమంటావా ?"

"ఆ. సుతరాం."

"ఐతే, కాళికాదేవి అర్ధరాత్రిదాటితేనే గుళ్లోకి వస్తుంది. అందుచేత నీవు అర్ధరాత్రినుండి అక్కడ ఉండటం మంచిది."

"పెండలాడే నాకు భోజనంపెట్టి సాగింపటానికిది ఒక ఎత్తన్నమాట."

"అసలుసంగతి అది కాదు. అర్ధరాత్రిదాటితే నీకు తగని భయం. కాబట్టి ఇక్కడకు వెంటనే వస్తున్నావు."

"పోనీలెండి. ఇక వెళ్లివస్తాను. సెలవు తీసుకొంటాను."

"పొద్దుపోయింది. ఈరాత్రి ఇక్కడే పడుకో. దయ్యాలు ఏమీ రావులే."

"ఏమండీ, ఐతే మీరు దయ్యాలతో మాట్లాడుతారట నిజమేనా ?"

"అక్షరాలా నిజమే."

"నాకుకూడా వాటిని చూపరూ ?"

"అర్ధరాత్రికి తిరిగితిరిగి వచ్చే నీకన్నా పెనుభూత మేముంది ? ఐనా ఇక్కడ నిద్రపో. దయ్యాలున్నయ్యేమో చూద్దుగాని" అని అంటూ అతన్ని పంచలోకి తీసుకొనివెళ్లి, పక్క వేసి, నిద్రపొమ్మన్నది. ఆమెదారిన ఆమె లేచిపోయింది ప్రక్కగదిలోకి. ప్రతిక్షణమూ దయ్యాలు వస్తున్నయ్యని అనుకొంటూ, వాటిని చూడాలనే కుతూహలంతో, అవేం చేస్తయ్యో అనే భయంతో నిద్రపోకుండానే పడుకున్నాడు. నరసమ్మ తన కేమీ అపాయం రానియ్యదనే ధైర్యం తెచ్చుకుంటూ మెలకువతోనే ఉన్నాడు. ఆ దయ్యాలు వస్తే వాటి నెలా పలకరించాలా అని ఎన్నో సంభాషణలను మనసులో అల్లుకొంటున్నాడు. ఎంతకాలం గడచినా ఒక్కదయ్యమైనా కనబడలేదు. వాటి కాళ్ళూ చేతులూ వెనక్కు తిరిగి ఉంటయ్యనీ, గోళ్ళు పెద్దవిగా ఉంటయ్యనీ, జుట్టు విరబోసికొంటుందనీ, తా నిదివరకు విన్న విషయా లన్నింటినీ జ్ఞప్తికి తెచ్చుకొని, వాటిని సరిగా పరీక్షచేయాలని నిశ్చయించుకొన్నాడు.

కోడికూసింది. నిరుత్సాహపడ్డాడు. కోడికూస్తే దయ్యంరాదు. ఇక ఏం చెయ్యాలి ? నిద్రపట్టలేదు. తన కుతూహలమంతా నాశనమైంది. పైన తెల్లవారినాక నరసమ్మ ఇంట్లోకే మకాంమార్చాడని ఇతరులకు తెలిస్తే, ఇంకొక కొత్త అపవాదుకూడా బయలుదేరుతుంది. ఏమీ తోచక, ఎలాగైనా లేచిపోవాలని నిశ్చయించుకొన్నాడు. కాని ఆమెతో చెప్పి వెళ్ళాలి. ఆమె ఎక్కడ పడుకుందో తెలియదు. ప్రక్కగదిలోకి వెళ్ళినట్లు రాత్రి చూశాడు. సరే, ఆమె అక్కడే పడుకొనిఉంటుందనుకొని వెళ్ళాడు. ఒక్క మంచమే ఉన్నది. దీపంలేదు. ఎవరో గాఢసుషుప్తిలో ఉన్నారు. "నరసమ్మగారూ, నరసమ్మగారూ" అని పిలిచాడు. కాని ఎవరూ ఉంకలేదు. ప్రాణంవిసికి చేతితో నెమ్మదిగా ముఖం కదిపి మళ్ళా పిలిచాడు. ఎందుకో గుండె వేగంగా కొట్టుకున్నది. "ఆమె లేస్తే ఏమనుకొంటుంది ? ఎందుకు లేచివచ్చావంటే ఏమని చెప్పాలి ? వెళ్తున్నానని చెప్పటానికి అంటే ఆమె ఏమంటుంది ?" అని ఏమేమో ఆలోచించుకొని, లాభం

లేదని, దాహమౌతున్నదని అందామని నిశ్చయించుకొని మళ్ళా లేపాడు. ఫలితం శూన్యమే.

నెమ్మదిగా చేతిమీద కొట్టిలేపాడు. "ఎవరు వారు" అన్నది. "నేనండీ, చంద్రశేఖరాన్ని. దాహమేస్తున్నది. కాసిని మంచినీళ్లివ్వండి" అన్నాడు. ఆమె లేచి నీళ్లు తీసికొనిరావటానికి రివ్వున వెళ్ళింది. ఆమె నరసమ్మగారి కాళికేమోనని ఆనడక చూసినాక అతనికి స్ఫురించింది. చాలా భయం వేసింది. నిజంగా ఆమెకూతురే ఐతే, నరసమ్మ ఈసంగతి చూస్తే ఏమంటుందో అని జంకాడు. గబగబా లేచిపోయి తన పక్కదగ్గరకు వెళ్లి కూచున్నాడు. అప్పుడే పొద్దు పొడుస్తున్నది. ఆ అమ్మాయి నీళ్లు తెచ్చి అందిచ్చింది. కాస్త ధైర్యం తెచ్చుకొని పలకరిద్దామనుకొన్నాడు. నీళ్లు తాగలేక తాగలేక ఎలాగో తాగాడు. "ఇంకా కాసిని కావాలా" అని మెల్లిగా అడిగింది. అప్రయత్నంగా జవాబిచ్చాడు: "మీపేరేనా కాళిక" "అవునండీ" అన్నది నవ్వుతూ. అతనికి భయం వేసింది. నిజంగా నరసమ్మ తన కీవివాహం చేయాలని వశీకరణం ప్రయోగించిందేమోనని చాలా దిగులుపుట్టింది. దీనికి తగ్గట్టు ఆ అమ్మాయికూడా కదలకుండా మెదలకుండా నిలిచిపోయింది. ఇలా ఉంటే స్రుతిమించి రాగాన పడుతుందని, "క్షమించండి. నిద్రలేపాను. దాహం చాలా అపరిమితంగా వేసింది" అన్నాడు. "అందుకనేనా అః కాసిని నీళ్ళూ తాగలేకపోయారు" అన్నది కొంటెగా. గ్రహించాడు సర్వమూ. తన భయం ధ్రువపడ్డది. ఇక ఎలా తప్పించుకోవాలి అనే ఆలోచనలో పడ్డాడు "కాదండీ, మీ అమ్మగారు నాకు దయ్యాల్ని చూపిస్తానన్న దీరాత్రి. చాలాసేపు నిరీక్షించాను. లాభం లేకపోయింది. పైగా దాహం వేసింది. నీళ్లు తాగుతూకూడా, దయ్యాలు అదృశ్యమై వస్తయ్యని పరీక్షిస్తున్నాను నాలుగు దిక్కులూ. అందుకని జరపుగా తాగలేదు" అన్నాడు. "దేవతాసాక్షాత్కారం కావాలని మీరు తపస్సు చేస్తున్నారట నిజమేనా?" అని సాభిప్రాయంగా అన్నది. అవునన్నాడు తడుముకోకుండా. "దేవత కనబడాలనేవారికి దయ్యాలు కనబడవు" అన్నది. "ఐతే దేవతకూడా కనబడటంలేదుగా" అన్నాడు. "అర్ధరాత్రి దాటింతరువాత తపస్సు చెయ్యమని మాఅమ్మ చెప్పిందిగా. అలా చేస్తే కనిపించదూ." అన్నది. "ఏమో" నన్నాడు. "మీ రీరాత్రి చేసిన తపస్సుకు తార్కాణంగా కాళిక కన్పించిందే" అన్నది కొంటెగా. వెంటనే ఏదో భావం స్ఫురించింది. ఆమెచేయి పట్టుకొన్నాడు. ఆఅమ్మాయి బాగా చేయివిదిలించుకొని రివ్వున లేచిపోయి తనపక్కమీద కూర్చొన్నది. అతనూ వెంబడించాడు. సమీపంలో నిలబడి చేతులు జోడించుకొని ముఖమొకసారి చూపించమని ప్రార్థించాడు. కాకుల కూత వినబడ్డది. "మాఅమ్మ లేచే వేళైంది. మీరుపోయి, ఏమీ తెలీనివారిలాగా పడుకోండి. రేపుకూడా ఇక్కడ ఉంటే, నన్ను స్పృశించనని వాగ్దానంచేస్తే, ముఖం చూపిస్తా" నన్నది. సరేనని చంద్రశేఖరం వెళ్లిపోయి ఏమీఎరగని అమాయకునిలాగా పక్కమీద పడుకొని గురకలు మొదలు పెట్టాడు.

మర్నాటి రాత్రి చాలా పొద్దుపోయింది. నరసమ్మ చాలాసేపు మేల్కొనిఉన్నది. కాలక్షేపానికి కూతుర్ని పిలిచింది. ఏవేవో మాట్లాడుకుంటూ కాలం గడిపారు.

"ఐతే, అమ్మాయి, పొద్దున చంద్రశేఖరంమంచం దగ్గిర మంచినీళ్ల చెంబున్నదేమిటి? నేను పెట్టినట్లు జ్ఞాపకంలేదే. నిన్నేమన్నా లేపి మంచినీళ్లడిగాడా" అని అడిగింది.

ఉన్నదున్నట్లుగా కాళిక పూసగుచ్చినట్లు చెప్పింది. నరసమ్మ లోపలలోపల నవ్వుకొంటూ "ఇదేనా అతగాడి గాఢసుషుప్తి, గురకలూనూ" అన్నది. కాసేపు నిశ్శబ్దం.

"ఈరాత్రికికూడా అతడు ఇక్కడే పడుకొనేటట్లు చేస్తాను. నివురాత్రం నేపడుకొనేచోట పడుకో. నేను నువ్వు పడుకొన్నచోట నిద్రపోతున్నట్లు నటిస్తాను. ఏం జరుగుతుందో చూద్దాం."

అన్నది. కాళిక అలాగే నని వెళ్లిపోయింది. అర్ధరాత్రి దాటిన ఎంతసేపటికో చంద్రశేఖరం భోజనానికి వచ్చాడు. నియమాలమీద, అలవాట్లమీద దీర్ఘోపన్యాసం ఇస్తూ భోజనం పెట్టింది. అత డిక

వెళ్ళబోతుంటే, "పొద్దుపోయింది. నీ బసకు వెళ్ళాలంటే చాలాదూరం. ఇవాళకూడా ఇక్కడే పడుకో" అన్నది.

"కాదండీ నరసమ్మగారూ, క్షమించండి. వెళ్తాను. నేను రాత్రి ఇక్కడ పడుకొన్నానని దుర్మార్గుడెవరో అప్పుడే గ్రహించి గోలచేస్తున్నాడు. వెళ్తాను. పైగా రాత్రి దయ్యాలను చూపిస్తానని చెప్పారు. ఒక్క దయ్యమేనా రాలేదు" అన్నాడు.

"కాదు, ఇవాళ తప్పకుండా చూపిస్తాను. వాళ్లకేం? ఇక్కడే పడుకొనితీరాలి" అని బలవంతం చేసి ఒప్పించింది.

పోయి పడుకున్నాడు. దయ్యాలను చూడాలని ఒక పక్క కుతూహలం ఉన్నది. కాని దయ్యాలకు బదులు కాళికాదేవతే ప్రక్కగదిలో కనబడుతుందని నిశ్చయించుకొన్నాడు. లేచి నెమ్మదిగా వెళ్లి ఆమె పక్కదగ్గర నిలబడి, "కాళికా, ముఖం చూపించవూ" అన్నాడు దీనంగా చాలాసార్లు. చివరకు ఆమె లేచి-

"నన్ను ముట్టుకోనంటే చూపిస్తాను" అన్నది.

"ముఖం చూపేదాకా ముట్టుకోను లే" అన్నాడు.

నరసమ్మ లేచి చిన్న దీపం వెలిగించి తెచ్చి బల మీద పెట్టి ఇక ముఖం చూడమన్నది. "అచ్చగా మీ అమ్మలాగానే ఉన్నావు" అంటూ చేయిపట్టుకొన్నాడు. ఏం చేస్తాడో చూడామని, గట్టిగా చేయి విదిలించలేదు. ఆమెను దగ్గరకు లాక్కొని, కౌగలించుకొని, ముద్దుపెట్టుకొన్నాడు. అప్పటి ఆ వుద్రేకంలో తను చేస్తున్నది తప్పని ఆమెకు తోచలేదు.

ఆమెకు ముప్ఫైఏళ్లున్నవి. కూతురు పుట్టిన ధర్మమా అని మొగుడు చనిపోయినాడు. అప్పటినుంచీ చాలా జాగ్రత్తగా సత్ప్రవర్తనతో మెలగుతూ వచ్చింది.

* * *

కాళికను వివాహం చేసుకోవాలని అతనికి హృదయంలో బాగా నాటుకొనిపోయింది. రోజురోజుకీ ఈ ఉద్దేశం ఎక్కువైపోయింది. ఒక రోజున నరసమ్మతో ఈ విషయం ప్రస్తావించాడు భోజనం చేస్తూ. ఆమెకు నవ్వూ, ఏడుపూ వచ్చినై. అతని కేమీ తోచలేదు. చాలా కష్టంతో—

"కొద్దిరోజులు గడవనీ. పైగా మీవాళ్లేమంటారో కూడా తెలుసుకోటం మంచిది. ఇప్పటికే ఊళ్లో అపవాదులు చాలా ప్రబలమైపోయినవి. జాగ్రత్తగా మెలగాలి"

అని ధైర్యం చెప్పుకొని అన్నది. కాని చంద్రశేఖరం లోకంలో ఏకాకి. చంద్రశేఖరానికి ఏడాది తిరక్కముందే తల్లిదండ్రులు గతించారు. అన్నదమ్ములు, అప్పచెల్లెళ్లు ఎవ్వరూ లేరు. ఉన్న బంధువులు ఆస్తి అంతా సంగ్రహించేశారు. పొరుగిళ్లవారి ధర్మమా అంటూ గెక్కలువచ్చేదాకా పెరిగాడు. తన సంగతంతా పూసగుచ్చినట్లు చెప్పేశాడు. "ఆలోచిద్దాంలే" అని మాత్రమనేసి, కూతుర్ని పిలిచింది. ఇద్దరూ అరతలకు వెళ్లి దీర్ఘంగా సంభాషించారు. చివరకామె వచ్చి, "చంద్రశేఖరం, నీవూ కాళికా కలిసి ఆలోచించుకొని నిశ్చయించండి" అని చెప్పలేక చెప్పలేక చెప్పి వెళ్లిపోయింది.

అతని కేమీ తోచలేదు. ఇలాంటి సంఘటనలలో ఎలా ఎదురుకోవాలో అతనికేమీ తెలీదు. ఐనా ప్రస్తావన మొదలుపెట్టినాడు. కాళిక చాలా దీనంగా దిగులుతో నిలబడిఉన్నది. అతని భోజన మైపోయింది. చేతులూ కాళ్లూ కడుక్కొని, సమీపంలో కూచొని, తన హృదయంలో ఉన్న భావాలను ఆమెకు వెళ్లబుచ్చాడు. కాళికకు ఏడుపు పొర్లుకొనివస్తున్నది.

"ఈ వివాహం మీకు శ్రేయస్కరం గాదు" అన్నది.

నిశ్చేష్టుడైనాడు. ఇలా అంటుందని అతడు అనుకోలేదు. 'ఏ'మన్నాడు.

"ఇప్పటికే చాలా అపవాదులున్నవి. లోకులంతా మా అమ్మను తిట్టిపోస్తున్నారు. నన్ను మీకిచ్చి వివాహంచేయాలని ఏదో తంత్రం పన్నిందంటున్నారు. ఈ పరిస్థితిలో మీ రీవూరు వదలిపెట్టిపోవడం చాలా మంచిది. లేకపోతే ఇక్కడ భోజనమైనా మానేయాలి" అన్నది.

ఒళ్లంతా తేళ్లూ, జెర్రులూ పాకినట్లయింది అతనికి. ఐనా—

"లోకంతో నాకేం సంబంధమున్నది? మీ అమ్మకీ సంబంధం ఇష్టమేకదా?" అని అడిగాడు.

"కాదు" అన్నది. కొయ్యబారిపోయినాడు మనిషి. ఇన్నాళ్లూ నరసమ్మ కూతుర్నిచ్చి తనకు

పెళ్లి చేయటానికి ఇష్టపడుతున్నట్లు కనిపిస్తున్న దతనికి. ఈ పరిణామ మర్థం కాలేదు. "ఎందుకని?" అన్నాడు.

"మా అమ్మ ఎవరో మీకు తెలుసుగాదా ?" అన్నది.

"తెలియకేం!" అన్నాడు.

"మానాన్న చనిపోయి పదిహేనేళ్లైంది. నన్ను పెంచి పెద్దదానిని చేసింది. పెద్దతనంలో దిక్కు లేకుండా పోతుంది. ఏపంచనైనా చేరుదామని లోపల ఆలోచన ఉన్నది"

ఈ సంభాషణకూ, తన భావాలకూ సంబంధ మేమీ కనపడలేదు.

"ఇదంతా అప్రస్తుతప్రశంసగా ఉన్నది. మన వివాహానికి మీ అమ్మ అంగీకరిస్తే, మనదగ్గరే ఉం టుంది. ఇంకా భయ మెందుకు ?"

"ఇదివరకంతా మా అమ్మ మిమ్మల్ని కొడుకు లాగా చూస్తూవచ్చింది. ఇప్పటినుంచీ నేను మిమ్మల్ని ఎలా చూడాలో నాకు బోధపడటం లేదు. అంతా అయోమయంగా ఉన్నది. పైగా మీ రెప్పుడూ రెక్కలమీదే ఆధారపడి ఉండాలి కాదా" అన్నది.

అతనికి వెర్రి ఎత్తినట్లున్నది. ఐతే కాళిక తనకు చెల్లెలువరస ఔతుంది కాబోలని భావించాడు. ఐనా ఆదరం చూపటంలో కొడుకుకన్నా అల్లుడిమీదనే కొందర కుంటుందని సమాధానపడ్డాడు.

"కొడుకులాగా చూడట మేమిటి? కొందరు అల్లుణ్ణికూడా అలాగే చూస్తారు. అంచేత నువ్వు నాకు చెల్లెలువరస కావులే. పిచ్చిఆలోచనలు వద్దు" అన్నాడు.

ఆమెకళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగినై. ప్రపంచ మంతా వేగంతో తిరిగిపోతున్నట్లు కన్పించింది. చితికి పోయిన ధైర్యాన్ని ఒక్కసారిగా దగ్గరతీసికొని—

"మీకూ, నాకూ వయస్సులో ఎంత తేడా ఉన్నదో తెలుసా ?"

"ఐదేళ్ళుండేను"

"ఇంతేనా ? మీ కీవరకు వివాహమైఉంటే నాఅంత కూతురే పుట్టిఉండేది" అని అంటూ శోకంతో రివ్వున లేచిపోయింది.

అతడుకూడా వెంట నడిచిపోయినాడు. తను పడుకునేస్థానందగ్గరకు వెళ్లిచూచాడు. పక్క వేసి ఉన్నది. కాని కాళికతో కచ్చితంగా ఏసంగతీ తేల్చుకోవాలని నిశ్చయించుకొని లోపలకు వెళ్లాడు. పక్కగదిలో ఎవ్వరూ లేరు. ఆశ్చర్యమూ, భయమూ వేసినవి. పక్కనే వున్న హాలులోకి వెళ్లాడు. మంచం మీద కూర్చొని, ఆమెబుజంమీద చేతితో తట్టూ, ఓదార్చటం మొదలుపెట్టాడు. కాని ఆమె ఎంత దిగ మింగుకున్నా ఏడుపు ఆగలేదు. తన చేతితో ఆమె ముఖాన్ని దగ్గరకుతీసుకున్నాడు. కన్నీటిని తుడిచి వేశాడు. అనునయంగా పలకరించాడు. కాని ఆమె కదలలేదు. మెదలలేదు. పట్టరాని ఆవేశంలో ఆమెను ముద్దుపెట్టుకొన్నాడు. ఇక ఆమె తన భావాలను అణచుకోలేక పోయింది.

"చంద్రశేఖరం, ఆదీపం పెద్దదిచేయి" అన్నది. అతడు శిరసావహించి, చేసి ఆమెను చూచాడు. అత నికి పిచ్చిఎత్తిపోయినట్లుంది. అప్పుడుగాని ఆమెకూ, కాళికకూ ఉన్న భేద మతనికి బోధపడలేదు. ఇక అక్కడ ఉండలేక, లేచిపోవాలని బయలుదేరాడు. ఆమె అతనిచేతిని గట్టిగా పట్టుకొని పోనీయలేదు. అతనికి తీరని అవమానంగా ఉన్నది. కాని ఆమె నవ్వుతూ—

"కాళిక అంతా చెప్పిందా, లేదా ?" అని అడిగింది.

* * * *

నరసమ్మ దీర్ఘంగా యోచనచేసింది మర్నా డంతా. తన సుఖానికి కూతుర్ని బలిఇయ్యాలా వద్దా అనే ప్రశ్న కలతపెట్టింది. కాని అతడు తన కూతుర్ని తప్ప పెళ్లిచేసుకోడు. కాని ఈవిషయమంతా విన్నాడు కనుక, ఇక ఆఇంట్లోకే రాడు. మూడు జీవితాలూ నిష్ప్రయోజనాలవుతాయి. జీవితం ఛాలా తుచ్ఛమని తోచింది. కూతురితో మాట్లాడటానికికూడా ఆమె కెందుకో భయంవేసింది. ఆనాడు పగలు భోజనానికి చంద్రశేఖరం రాలేదు. పొద్దుకూకవచ్చింది. ఊళ్లో ఎవరినన్నా అతని సంగతి అడుగుదామంటే, తనతో ఎవ్వరూ మాట్లాడరు. చీకటిపడ్డది. అతను రాలేదు. అతనేమైనాడో తెలియదు. కూతురుకు భోజనం పెట్టి నిద్రపొమ్మని పంపేసింది. ఎంతసేపు జాగరణచేసినా లాభంలేకపోయింది. ఇక లాభంలేదని, కాళికాల యంలో అతడుంటే పట్టుకువద్దామని తేల్చుకొని

బయలుదేరిపోయింది. ఆమె వెళ్ళిన కాసేపటికి చంద్రశేఖరం వచ్చాడు. తలుపు ఓరవాకిలిగా ఉన్నది. లోపలకు వెళ్ళాడు. తనకోసం నిరీక్షిస్తూ తలుపు వెయ్యలేదేమోనని, ఇప్పుడు తలుపు దగ్గరగా వేశాడు. లోపల అంతా నిశ్శబ్దం. వెళ్ళాడు. ఎవరూ కనబడలేదు. పక్కగదిలోకి వెళ్ళి ఆమెను లేపి అన్నం పెట్టించుకు తిని వెళ్ళాలని వచ్చాడు. అక్కడెవరో పడుకుంటే ఆమే నరసమ్మని లేపాడు. కాళిక లేచింది అతన్ని చూడగానే "పగలు ఉపవాసం చేశారా!" అన్నది. "ఔ"నన్నాడు. "ఎందుకని?" అని అడిగింది. "మీరు చెప్పినమాటలు ఎంతవరకూ నిజమో అని ఆలోచిస్తున్నాను" అన్నాడు. "అక్షరాలా నిజమే"నన్నది. ఈ సమాధానం పిడుగులాగా పడ్డది. ఇలా ఔతుందని అతడెన్నడూ అనుకోలేదు. "ఇక మన వివాహం కుదరగూడదుగదా" అన్నాడు. "అంతే" నన్నది. "ఐతే వెళ్ళిపోతా" నన్నాడు. "మాఅమ్మ ఇదంతా వింటే......" అని అనబోయింది. ఇంతదాకా ఆమెనే నరసమ్మగా భావించినవాడు కాస్తా అదిరిపోయి, మంచంమీదనుంచీ లేచి నిలబడ్డాడు. కింద తలుపు శబ్దం వినవస్తున్నది. కాళిక లేచింది. బలవంతంగా చేయిపట్టుకొన్నాడు. ఆమె విదల్చుకోబోయింది. కాని లాభంలేదు. తనను కాపాడమని వేడుకొన్నాడు. ఇంతలోకే నరసమ్మ వచ్చి ఈ దృశ్యం చూచింది. ధైర్యం తెచ్చుకొని—

"చంద్రశేఖరం, ఏం జరిగిందో జరిగింది. అన్నీ మనము అనుకొన్నవాటికి వ్యతిరేకంగానే జరిగినై. ఇకనైనా శాంతంగా కాలం గడుపుదాం. కాళికను నీకూతురుగా చూసుకో" అన్నది.

ఏపాపమూ ఎరగని చంద్రశేఖరానికి ఏడుపూ, కోపమూ వచ్చినై. చేయివిదల్చుకొని రివ్వున బయటపడ్డాడు. నరసమ్మ వెంబడించింది. ఎక్కడకు వెళ్తున్నారో, ఏమౌతుందో నని కాళికకూడా బయలుదేరింది. శీఘ్రకాలంలో కాళికాలయంలోనికి చేరారు. ఇదివరకు అక్కడున్న ఆ పాడుబడ్డ విగ్రహంకూడా కన్పించలేదు. ఇదే తన అవసానకాలానికి తార్కాణమని భావించాడు అంతటా వెదికాడు. ఎక్కడా విగ్రహం లేదు.

"చంద్రశేఖరం, నువ్వు కాళికను ఇన్నాళ్లు ప్రార్థించావు. కాని దేవత సుషుప్తిలో ఉన్నది. నీ మొర ఆలకించలేదు. ఇక లాభమేముంది" అన్నది నరసమ్మ.

అతడు గర్భగుడిలోకి వెళ్ళి, చిన్నకొవ్వువత్తి దీపం వెలిగించాడు.

"ఇక మీరు వెళ్ళండి. రేపుఉదయం మిమ్మల్ని కలుసుకొని మీకు నా నిశ్చయం తెలియజేస్తా" నన్నాడు.

ఇంతవరకూ కాళిక వారికి కనబడకుండా దాక్కొని ఉన్నది. నరసమ్మ మారుమాటాడకుండా ఇంటికి వెళ్ళిపోయింది. వెంటనే కాళిక అతని దగ్గరకు వచ్చి చేయిపట్టుకున్నది. అతడు తన వస్త్రంతో ఏమో చేయబోతున్నాడు. వెంటనే కాళిక ముందు నిలబడింది. ఆమెకు భయం వేసింది.

"ఏమిటి విపరీతం ? ఇంతమాత్రానికే ఇంత విరక్తి కలగాలా ?"అన్నది.

"నన్ను వదలిపెట్టి వెళ్లు" అన్నాడు.

"వీల్లేదు. ఇక్కడ మిమ్మల్ని ఒంటరిగా వదిలితే మీరేంచేస్తారో భయంవేస్తుంద" అన్నది.

"అంతా అంధకారంగా ఉన్నది. ఇలా ఐనదని నేనెప్పుడూ అనుకోలేదు" అన్నాడు.

"కాళికాదేవి సుషుప్తిలో ఉండి మీకీవర మిచ్చిం"దన్నది. పూర్వస్మృతులు లేవో గిర్రున తిరిగినవి అతని మనస్సులో. సుషుప్తిమాత్రమే అతనినికూడా ఈ దశలోకి తెచ్చింది.

"ఇప్పటికైనా మా అమ్మ మీకు భూతాలు చూపించిందా" అన్నది వికటంగా.

చప్పున లేచాడు. 'ఇంటికి పోదాంపద' అన్నాడు. ఇద్దరూ బయలుదేరారు. ఇంట్లో ప్రవేశించారు.

* * * * *

మర్నాడుదయం ఆ ఇంటిముందు జనమంతా మూగినారు. అంతా బూడిదతప్ప ఏమీ కనబడలేదు. ఆ చుట్టుపక్కల ఇళ్లుకూడా కొన్ని నాశనమైనవి. సుషుప్తిలో ఉన్నవాళ్లు సుషుప్తిలోకూడా లేరు. ఎక్కడనుంచీ నిప్పు బయలుదేరిందో ఎవరికీ అర్థంకాలేదు. ఎముకలుకూడా లేవు. కొందరకు బూడిదకూడా కనబడలేదు. ఆ రోజునుంచీ ప్రతిరాత్రీ కాళికాదేవి అక్కడకు వచ్చి ప్రళయనృత్యం చేస్తూఉంటుందని అంతా భావించేవారు. కాళికాదేవితో ఇద్దరు స్త్రీలు, ఒక పురుషుడుకూడా వచ్చి నాట్యం చేస్తూ ఉంటారని కొందరు గమనించారుకూడా. కాని అంతవరకూ అది సుషుప్తిమాత్రమే. చంద్రశేఖరానికో ?